క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

సైదాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆదివారం నెల్లూరు ఆర్డీఓ మలోల పరిశీలించారు. సైదాపురంలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయులకు సంబంధించిన మూడు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

తడ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చెన్నై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 1న కాదలూరు గ్రామంలో మృతిచెందిన హోంగార్డు అంత్యక్రియలకు సూళ్లూరుపేట మండలం జంగాలగుంట గ్రామానికి చెందిన తిన్నలూరి శేఖర్ వెళ్లాడు. టిఫిన్ తినేందుకు మరో వ్యక్తి బైక్ వెనుక కూర్చుని జాతీయ రహదారికి చేరుకున్న సమయంలో అదేమార్గంలో వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ని చెన్నై జీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేఖర్ మృతిచెందాడు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం



సమావేశాన్ని నిర్వహిస్తున్న సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని

సూళ్లూరుపేట: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రముని ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. 13న ఎన్నికలు నిర్వహించనుండడంతో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారిని ఆర్డీఓ ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా చూడాలని కోరారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల నిర్వహణలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవాలని, అలాగే ఓటర్ల జాబితాలను సిద్ధంగా ఉంచుకుని ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అన్నారు. సూళ్లూరుపేట తహసీల్దార్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 43.978 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 43.978 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీజ్‌కు 50, హైలెవల్ స్లూయీజ్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

పరామర్శ

పెళ్లకూరు: సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం పెళ్లకూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పట్టూరు మోహన్‌రెడ్డిని పరామర్శించారు. ఇటీవల పెళ్లకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహన్‌రెడ్డికి తీవ్రంగా గాయాలయ్యాయి. మోహన్‌రెడ్డి చెన్నైలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఎమ్మెల్యే సంజీవయ్య పెళ్లకూరులోని ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న నేదురుమల్లి, చిత్రంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

- తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

రాపూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం వేపినాపి సమీపంలోని పోతుకొండ అంకమ్మ తల్లి సన్నిధిలో పాపకన్ను మధురెడ్డి, దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మండల వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అప్పగించిన పనిని చిత్తశుద్ధితో నిర్వహించడమే తన కర్తవ్యమన్నారు. నియోజకవర్గానికి నాయకునిగా కాకుండా సేవకునిగా పనిచేసే భాగ్యం తనకు సీఎం కల్పించారన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక మెజార్టీ తీసుకొచ్చేలా మనమంతా కృషిచేయాలన్నారు. పెంచలకోన దేవస్థానానికి ప్రభుత్వం 200 ఎకరాల భూమి అందించనున్నదని ఈ క్షేత్రాన్ని టూరిజంగా, క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌ల విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే 30 సంవత్సరాలు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని కోరారు. అనంతరం రాపూరు, ఆకలివలస, పంగిలి గ్రామాలకు చెందిన పలువురు తెలుగుదేశం నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి నేదురుమల్లి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు దందోలు నారాయణరెడ్డి, రవికుమార్, రవీంద్రారెడ్డి, ప్రచార విభాగ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, వెంకటగిరి కన్వీనర్ ఢిల్లీబాబు, రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ చైర్‌పర్సన్ శిరీష పాల్గొన్నారు.

పెంచలకోనలో నేదురుమల్లి..

పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయన్ను దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రతిఒక్కరూ విద్యలో రాణించి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో ఆదివారం టీఎంఆర్ కళాశాల వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యపై మక్కువ చూపాలన్నారు. ముందుగా కళాశాల నిర్వాహకులు ఎమ్మెల్యే కిలివేటిని, నేతలను ఘనంగా సత్కరించారు. అనంతరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా మెమెంటోలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, పేర్నాటి రాహుల్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన నాయుడుపేట క్రీడాకారులు



పతకాలు సాధించిన ఎస్ఎస్ఎఫ్ క్రీడాకారులు

నాయుఎడుపేటటౌన్: తమిళనాడు రాష్ట్రంలోని పల్లవరంలో ఆదివారం జరిగిన ఓపెన్ మారథాన్ అథ్లెటిక్ పోటీల్లో నాయుడుపేట ఎస్ఎస్ఎఫ్ (నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్) క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. రెండు వేల మీటర్ల పరుగుపందెంలో ఎం. మహిధర్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. నాలుగు వేల మీటర్ల పరుగుపందెంలో ఎస్.మోక్ష ద్వితీయ స్థానం, ఎస్. వరుణ్‌సందేశ్ తృతీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తమిళనాడులో జరిగిన పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎవరెస్టు ఎక్కిన మొట్ట మొదటి మహిళ ముత్తమిళ సెల్వి చేతులమీదుగా నగదు బహుమతులతో పాటు మెడల్స్, మెమెంటోలను అందించినట్లు లక్ష్మయ్య వెల్లడించారు. విజేత క్రీడాకారులకు స్థానిక ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షులు కలికి సుధీప్‌రెడ్డి, కాలగంధ శీహరి అభినందించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



దక్కిలి మండల నేతలతో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేద్దామని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు సెంట్రల్‌బ్యాంక్ డైరెక్టర్ వెలికంటి రమణారెడ్డి ఆధ్వర్యంలో దక్కిలి మండలం వెలికల్లు, మార్లగుంట, కొత్తపల్లి, సంగనపల్లి, అల్తూరుపాడు, తీర్థంపాడు, దగ్గవోలు, పాతనాలపాడు, నాగవోలు, మిట్టపాళెం గ్రామాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి శాలువాలు కప్పి, అభినందనలు తెలిపారు. నేదురుమల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో దక్కిలి మండలంలో రాజకీయచైతన్యం ఎక్కువని గతంలో తన తండ్రి, దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తనతో చెప్పేవారని, ఆయనతో నడిచిన తొలితరం నేతల్లో వెలికంటి రమణారెడ్డి స్థానం ప్రత్యేకమని తెలిపారు. సీనియర్‌ల సలహాలతో నియోజకవర్గంలో త్వరలో జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో దక్కిలి వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, మండల బూత్ కన్వీనర్ కాసరం చైతన్యరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, మునిభాస్కర్‌రెడ్డి, బాబు, శంకరరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, సీపీఎల్ నరసింహారావు, ఎం మునిరామ్‌రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

రాజా కుటుంబీకులకు పరామర్శ

వెంకటగిరి సంస్థానం పెద్దరాజాగారి వీవీవీఆర్‌కే యాచేంద్ర పెద్ద కుమార్తె రత్నకుమారి ఇటీవల మృతిచెందడంతో ఆదివారం స్థానిక రాజాప్యాలెస్‌లో ఎస్వీబీసీ చైర్మన్, రాజాకుటుంబీకుడు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్రలను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిసి పరామర్శించారు.

జగనన్నతోనే చేనేతలకు ఆర్థిక భరోసా



చేనేత కార్మికునితో మాట్లాడుతున్న జింకా విజయలక్ష్మి

వెంకటగిరి: చేనేత కార్మికులను గతంలో ఏ ప్రభుత్వం ఆదుకోని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఆర్థికభరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని చేనేత కార్మికులను ఆదివారం ఆమె కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చేపట్టాల్సిన చర్యలను కార్మికులద్వారా తెలుసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఎం.జానకి రామయ్య పాల్గొన్నారు.

మాంసపు దుకాణాలపై దాడులు



పొట్టేలు..గొర్రె మాంసం తేడాను చూపుతున్న కమిషనర్ సాయినాథ్

గూడూరు: మాంసపు దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ఆదివారం దాడులు నిర్వహించారు. పొట్టేలు మాంసం అంటూ వేలాడదీసి, లోపల గొర్రెల మాంసం విక్రయిస్తారా అంటూ మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు మాంసపు దుకాణాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల బయట మాత్రం పొట్టేలు మాంసాన్ని వేలాడదీసి, వెనుక గొర్రెల మాంసాన్ని విక్రయిస్తుండడాన్ని ఆయన దాడి చేసి పట్టుకున్నారు. పలు దుకాణాల్లో ఫ్రీజర్లలో దుర్వాసన వెదజల్లుతున్న 50 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇకపై ఎక్కడైనా ఇలాంటివి విక్రయిస్తే వారి లైసెన్సులు కూడా రద్దు చేస్తామని దుకాణదారులను హెచ్చరించారు.

రైల్వే క్రికెట్ టోర్నమెంట్ విజేత సూళ్లూరుపేట



విజేత రైల్వే సోల్జర్స్ జట్టుతో అధికారులు

నాయుడుపేటటౌన్: దక్షిణ రైల్వే ఉద్యోగుల ఫ్రెండ్‌షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో సూళ్లూరుపేటకు చెందిన రైల్వే సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. శని, ఆదివారాలు రెండు రోజులపాటు స్థానిక ఏఎల్‌సీఎం మైదానం ఆవరణలో క్రికెట్ పోటీలు జరిగాయి. దక్షిణ రైల్వే డివిజన్ పరిధిలోని పొన్నేరి నుంచి గూడూరు రైల్వేస్టేషన్‌ల వరకు రైల్వే ఉద్యోగులు 10 జట్లుగా ఫ్రెండ్‌షిఫ్ టోర్నమెంట్‌లో తలపడ్డాయి. టోర్నమెంట్స్ చైర్మన్ సూళ్లూరుపేట రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అలెక్జాండర్ సారథ్యంలో పోటీలను నిర్వహించారు. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీలను అలెగ్జాండర్‌తో పాటు దక్షిణ రైల్వే ఎస్ఎంఆర్‌లు రంజిత్‌కుమార్, ట్రోఫీకాలమ్, ఎస్ఎస్ఈ కే కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎస్ఎం కే రమణయ్య, కిరణ్‌కుమార్ రైల్వే అధికారుల చేతులమీదుగా బహుమతులను అందించారు. క్రికెట్ పోటీలను తిలకించేందుకు వారి కుటుంబసభ్యులతో పాటు క్రీడాభిమానులు హాజరై సందడి చేశారు.

మలుపులతో ప్రమాదాలు

- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న వాహనచోదకులు



ముమ్మాయపాళెం వద్ద ప్రమాదకర మలుపు

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన అధికారుల్లో పర్యవేక్షణ కొరవడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పెదపరియ క్రాస్ నుంచి పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, ఇనుగుంట గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ముమ్మాయపాళెం, మాచవరం, తిరుమలపూడి గ్రామాలకు రోడ్ల వెంబడి మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపులు ఎల్, ఎస్ ఆకారంలో ఉన్నాయి. వాహనచోదకులు ఈ మలుపుల్లో ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారుల చుట్టుపక్కల పిచ్చి చెట్లు ఎక్కువగా రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలో రాత్రి వేళల్లో వాహనచోదకులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఆర్మేనిపాడు గ్రామం సమీపంలో ఓ మలుపు వద్ద ద్విచక్రవాహనం రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు విద్యార్థులు మత్యువాత పడ్డారు. వాహనదారులకు రోడ్డు మార్గం ఏవిధంగా తెలిపే సూచికబోర్డులు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా వాహనచోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించి మలుపులు వద్ద కొత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారంపై కౌన్సిలర్లు, పార్టీ నేతలతో సమీక్ష జరిగింది. వారు మాట్లాడుతూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డిచంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిచేలా కృషిచేయాలని కోరారు. సోమవారం ఎస్ఆర్ కల్యాణమండపంలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఏ శ్రీనివాసులురెడ్డి, ఎస్.గోపాలకృష్ణ, ఎస్. శేఖర్, ఎం.జానకిరామయ్య, నేతలు కె రాజారెడ్డి, టి.గణేష్‌రెడ్డి, కె సతీష్, మురళి, బండి రమేష్‌రెడ్డి, పోలయ్య, నాగభూషణం, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



వంటగదిలో తనిఖీలు నిర్వహిస్తున్న జడ్జిలు సునీల్‌కుమార్, అనూష

సూళ్లూరుపేట: పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సునీల్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్ అనూష ఆదివారం తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు కావడంతో వాటిని దృష్టిలో ఉంచుకుని ఏపీలోని అన్ని జిల్లాల్లో వెల్ఫేర్ హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు చేయాలని హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను స్థానిక జడ్జిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటగది, డైనింగ్‌హాలు, బాత్‌రూమ్‌లు, విద్యార్థుల గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా కూరగాయలు, బియ్యం నాణ్యతపై విచారించారు. గురుకుల పాఠశాలలో ఏవైనా సమస్యలున్నా చెప్పాలని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జడ్జిలు మాట్లాడుతూ విద్యార్థులకు తాజా కూరగాయలతో వంటలు చేయాలని, బాత్‌రూమ్‌లు, విద్యార్థులుండే గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సీనియర్, జూనియర్ లాయర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



నాయుడుపేట : కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు



గూడూరు: ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



శ్యాంసుందరపురంలో ప్రచారం చేస్తున్న నేతలు



సైదాపురం: ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు



కలవకొండలో నేతల ప్రచారం

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిల విజయం కోసం ఆ పార్టీ నాయకులు పట్టణంతో పాటు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, కటకం జయరామయ్య, రూరల్ కన్వీనర్ ఓట్టురు కిషోర్ యాదవ్, కౌన్సిలర్లు, ఏపీటీసీలు, పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించండి..

గూడూరు: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని పార్టీ పట్టణ కార్యదర్శి అన్నం మురళి కోరారు. పట్టణంలోని గమళ్లపాళెం, రాజావీధి ప్రాంతాల్లో ఆయన నేతలతో కలిసి ఆదివారం ముమ్మర ప్రచారం చేశారు. కార్యక్రమంలో నిరూప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కోటలో..

కోట: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం కోటలో నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కోట, శ్యాంసుందరపురంలో ఓటర్లను కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యతా ఓటును శ్యాంప్రసాద్‌రెడ్డికి వేయాలని కోరారు. సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, ఉపసర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

సైదాపురం: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని మండల జేఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ ఓటర్లను అభ్యర్థించారు. చాగణం, మర్లపూడి, సైదాపురంలో ఆదివారం పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో నేతలు వివేక్, గుంటమడుగు శ్రీనివాసులురాజు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిల్లకూరులో విస్తృత ప్రచారం..

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని నేతలు చిల్లకూరులోని పట్టభద్రులను, టీచర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ శీనయ్య, జేసీఎస్ కన్వీనర్ మనోజ్‌రెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



నాయుడుపేటటౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆర్యవైశ్యం సంఘ గౌరవ అధ్యక్షుడు, పారిశ్రామిక వేత్త పెసల జయరాజగోపాల్, ఆ సంఘ రూరల్ జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణి అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్య అధ్యక్షుడు యచ్చా లక్ష్మీనారాయణ, కార్యదర్శి కోటా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. సంఘ పెద్దలు మాట్లాడుతూ పట్టణంలోని ఆలయ సముదాయం వద్ద మూడు రోజులపాటు దాతలందరి చొరవతో రూ.40 లక్షలపైగా నిధులతో మహాకుంభాభిషేక వేడుకలను వైభవంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా దాతలందరినీ సంఘ పెద్దలు సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు ఎం.కృష్ణారావు, శ్రీరాములు, జి.భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ రోడ్డు ప్రాంతంలో వెలసియున్న రాజరాజేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చండీ హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.